క్లుప్తంగా

ఆధార్ అప్‌డేట్ చేయించుకోండి

ఓడీ చెరువు: ప్రతి ఒక్కరూ తమ ఆధార్‌ను అప్‌డేట్ చేయించుకోవాలని ఎంపీడీఓ పోలప్ప అన్నారు. శుక్రవారం మండలంలోని జీవన్‌జ్యోతి పాఠశాలలో ఆధార్ అప్‌డేట్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ-కేవైసీ కాని ప్రతి ఒక్కరూ తమ ఆధార్‌ను అనుసంధానం చేసుకోవాలని సూచించారు. మొదట పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆధార్ అప్‌డేట్ చేస్తున్నట్లు చెప్పారు. మిగిలిన వారు ఆయా సచివాలయాల వద్ద చేయించుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ రాజశేఖర్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ఎస్‌ఐగా గోపి కుమార్



ధర్మవరం: ధర్మవరం రైల్వే ఎస్‌ఐగా గోపి కుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కాగా.. ఈయన గతంలో ధర్మవరం స్టేషన్‌లో పని చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐకు సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

కదిరి అర్బన్: మండల పరిధిలోని కుమ్మరవాండ్లపల్లిలో నిరుపేద మున్నా కుమార్తె వివాహానికి వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మణింతనాయక్ శుక్రవారం రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

నల్లమాడ: పాతబత్తలపల్లి సచివాలయం పరిధిలోని ఎన్.ఎనుమలవారిపల్లి, రెడ్డిపల్లి సచివాలయం పరిధిలోని తిప్పయ్యగారిపల్లి, రెడ్డికుంట తండాలో శనివారం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కుళ్లాయినాయక్ ఓ ప్రకటనలో తెలిపారు.

వెలిచలమల పంచాయతీలో..

ఎన్పీకుంట: మండల పరిధిలోని వెలిచలమల సచివాలయం పరిధిలో శనివారం ఉదయం 7 గంటలకు ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి ఆధ్వర్యంలో 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ ఈటి రాము, ఎంపీడీఓ ఆదినారాయణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

మద్యం విక్రేతల అరెస్ట్

ధర్మవరం అర్బన్: పట్టణంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశామని వన్‌టౌన్ సీఐ సుబ్రమణ్యం తెలిపారు. బోయవీధి వద్దనున్న స్టేట్ బ్యాంకు సమీపంలో కూరగాయల అంగడి దగ్గర బెల్టుషాపు నిర్వహిస్తూ అక్రమంగా మద్యం విక్రయిస్తున్న పార్వతిబాయి, ఆమె కుమారుడు వెంకటేష్‌నాయక్‌ను అరెస్ట్ చేశామని పేర్కొన్నారు. వారి నుంచి 30 ఆంధ్ర మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు తరలించామన్నారు.

ఘనంగా గోదా రంగనాథుడి కల్యాణం



రంగనాథస్వామి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని పాండురంగ స్వామి ఆలయంలో శుక్రవారం గోదా రంగనాథస్వామి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. అర్చకులు వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. పూజల అనంతరం కల్యాణోత్సవాన్ని జరిపించారు.

బాబా షర్ఫోద్దీన్ ఉరుసుకు ఆహ్వానం

తలుపుల: స్థానిక కుమ్మరపేటలో ఈనెల 25, 26, 27 తేదీల్లో జరగనున్న బాబా షర్ఫోద్దీన్ ఉరుసుకు రావాలని ఎమ్మెల్యే సిద్దారెడ్డిని కమిటీ పెద్దలు అందుమియా, ఎంపీపీ రఫీ నాయక్, మాజీ సర్పంచ్ పయాజ్ అహమ్మద్ శుక్రవారం ఆహ్వానించారు. ఉరుసు నిర్వహణకు తన వంతు సహాయంగా ఎమ్మెల్యే రూ.50 వేలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు నజీర్, గౌస్‌మోదీన్, బాబ్జాన్, ఇలియాజ్, షాకీర్, షర్ఫోదీన్ ,బాబా ఫకృద్దీన్ పాల్గొన్నారు.

పేదలందరికీ ఇళ్ల మంజూరు

ఓడీ చెరువు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలందరికీ ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు ఎంపీడీఓ పోలప్ప, తహసీల్దార్ శ్రీధర్, హౌసింగ్ ఏఈ హరిప్రసాద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం అల్లాపల్లి పంచాయతీ పరిధిలో ప్రభుత్వ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అర్హులందరికీ ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేసిందన్నారు. అనంతరం లబ్ధిదారులకు గృహనిర్మాణ మంజూరు పత్రాలు, సిమెంట్ బస్తాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచు వెంకటరమణ, మండల అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ లక్ష్మీరెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, మైనారిటీ రాష్ట్ర కార్యదర్శి షామీర్‌బాషా, నాయకులు ఆనందరెడ్డి, నరసింహారెడ్డి, రామాంజనేయులు, మధు పాల్గొన్నారు.

మళ్లీ జగన్‌నే గెలిపించుకుంటాం



ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు కేశమ్మ. కుటుంబ సభ్యులతో కలసి మైలసముద్రంలో నివాసం ఉంటోంది. ఈమె కుటుంబానికి వైఎస్సార్ రైతు భరోసా ద్వారా రూ.40,500, వైఎస్సార్ డ్వాక్రా సున్నా వడ్డీ కింద రూ.6,082, వైఎస్సార్ సున్నా వడ్డీ (రైతులు) ద్వారా రూ.815, వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.23,122, వైఎస్సార్ పింఛన్ కానుక ద్వారా రూ.82,000లతో కలపి మొత్తం రూ.1,52,529 లబ్ధి చేకూరింది. గతంలో టీడీపీకి ఓటు వేసినా పథకాలు అందలేదని కేశమ్మ తెలిపింది. వైఎస్సార్‌సీపీకి ఓటు వేస్తామని పేర్కొంది.



ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు ఏండ్ల లక్ష్మీదేవి. తనకల్లు ఎస్సీ కాలనీలో నివసిస్తోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఈమె కుటుంబానికి వైఎస్సార్ రైతు భరోసా, పింఛను కానుక, వైఎస్సార్ బీమా, జగనన్న అమ్మఒడి, ఇంటి స్థలం కలిపి ఇప్పటి వరకూ రూ.5,20,250 లబ్ధి చేకూరింది. పేదోళ్లకి అన్ని రకాలుగా అండగా ఉంటున్న జగనన్న చేసిన మేలును ఎప్పటికీ మరచిపోలేమని లక్ష్మీదేవి హర్షం వ్యక్తం చేస్తోంది.



కొత్తచెరువు: వృద్ధులకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట



తనకల్లులో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి

- మా కుటుంబాలు చల్లగా ఉండాలంటే జగనే రావాలి
- 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో లబ్ధిదారుల హర్షం

కొత్తచెరువు: టీడీపీ పాలనలో ఇంత సాయం పొందలేదు. జగన్ ముఖ్యమంత్రి అయ్యాక తమ లాంటి పేదల జీవితాల్లో వెలుగులు నింపారు. మళ్లీ జగన్‌నే ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటామని పలువురు తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని మైలసముద్రం గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తేవాలని సూచంచారు. సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వృద్ధులు, రైతులు, వికలాంగులు, మహిళలు స్పందిస్తూ.. సకాలంలో సంక్షేమ ఫలాలు తమ ఇంటి వద్దకే అందుతున్నాయని తెలిపారు. ఇళ్లు లేని మాకు ఇళ్లు కట్టిస్తున్నారు. పిల్లలను విద్యాదీవెన పథకాలతో చదివించుకుంటున్నామని హర్షం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీకే మా మద్దతు అని ఎమ్మెల్యేకు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ.. రాజకీయాలకు కక్షలు, కార్పణ్యాలకు చోటు ఇవ్వకుండా అర్హులైన అందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. పుట్టపర్తిని శ్రీసత్యసాయి జిల్లాగా తెచ్చి ఈ ప్రాంతం సస్యశామలం చేశామన్నారు. ఫోర్ లేన్ రోడ్డు, 193 చెరువులకు నీరు, గ్రీన్ ఫీల్డ్ హైవే, రావడం ఈప్రాంత వాసుల అదృష్టమన్నారు. అనంతరం గ్రామంలో నిర్మించిన సచివాలయాన్ని ప్రారంభించి, జగనన్న ఇళ్ల నిర్మాణాలకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామాంజినేయులు రెడ్డి, ఎంపీడీఓ సిద్ధారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ జగన్మోహన్ రెడ్డి, సర్పంచులు ఇందిరమ్మ, నరేంద్ర రెడ్డి, ప్రకాష్, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, మటన్ శంకర్, డాక్టర్ లక్ష్మినరసింహారెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు రఘునాథ్ రెడ్డి, మాజీ సర్పంచులు శ్యాంసుందర్ రెడ్డి, సంజీవరెడ్డి, నాయకులు గోపాల్ రెడ్డి, గోవిందరెడ్డి, విశ్వనాథ్, నరసింహారెడ్డి, అశోక్ రెడ్డి, రమణారెడ్డి, నాగరాజు, టౌన్ కన్వీనర్ భాస్కర్, వాల్మీకి శంకర, బోయ యల్లప్ప, సుబ్బారావు, బాబు, గిరి, చంద్ర, అశోక్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి పెద్దపీట

- ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి

తనకల్లు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని షిర్డీ సాయిబాబా, దళితవాడ, బూడిదగడ్డ వీధుల్లో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని నేరుగా ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి ప్రతి కుటుంబానికి ఎంత లబ్ధి చేకూరిందో వివరించారు. బుక్‌లెట్లను అందజేశారు. పరిష్కారానికి నోచుకోని ఏవైనా సమస్యలుంటే తెలియజేయాలన్నారు. ఆయా వీధుల్లో మిగిలిపోయిన సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలను నిర్మించాలని గ్రామస్తులు కోరారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలకు సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్ రాజేంద్రను ఆదేశించారు. బూడిదగడ్డలోని అంగన్‌వాడీ కేంద్రం అద్దె భవనంలో ఉందని, పక్కా భవనాన్ని నిర్మించాలని పలువురు చిన్నారుల తల్లిదండ్రులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఇంటి స్థలాలున్న అర్హులకు పొజిషన్ సర్టిఫికెట్లను మంజూరు చేయాలన్నారు. దళితవాడలో ఒరియల్ గ్రౌండ్ నందు పైప్‌లైన్ నిర్మాణం చేపట్టి వెంటనే నీటి సదుపాయం కల్పించాలని ఎంపీడీఓ పూల నరసింహులుకు చెప్పారు. కార్యక్రమంలో మాజీ నియోజకవర్గ సమన్వయకర్త ఎస్ఎండీ ఇస్మాయిల్, మండల కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, మార్కెట్‌యార్డ్ చైర్మెన్ ఈశ్వర్‌రెడ్డి, సర్పంచ్ డీ. సరస్వతీ, వైస్ ఎంపీపీలు నాగలక్ష్మీ, సానే రమణమ్మ, మహిళా కన్వీనర్ విజయలక్ష్మీ, అసుపత్రి డైరెక్టర్ రామ్‌దేశాయ్, అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మెన్ కొండా మల్లికార్జున, డైరెక్టర్ పూల శీనా, నాయకులు శ్రీనివాసులనాయుడు, దేశాయి సంజీవురెడ్డి, భక్తవత్సలరెడ్డి, చిదానందరెడ్డి, బాల్‌రెడ్డి, నిజాం, తబ్రేజ్ , రామకృష్ణ, శ్రీనివాసులు, సిద్దారెడ్డి, బాబా, శ్రీరాములు పాల్గొన్నారు.

అతివేగం ప్రమాదకరం



మాట్లాడుతున్న కదిరి ఎంవీఐ వరప్రసాద్

కదిరి: వాహనాలను అతి వేగంగా నడపడం ప్రమాదకరమని కదిరి ఎంవీఐ డి.ఎస్.ఎం.వరప్రసాద్ పేర్కొన్నారు. రహదారి-భద్రతా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 24 వరకూ పోలీసు శాఖతో సమన్వయం చేసుకుంటూ రోడ్డు-భద్రతా వారోత్సవాలను నిర్వహిస్తామన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ముందుగా ఎల్ఎల్ఆర్ పొంది ఆ తర్వాత డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలని సూచించారు. డ్రైవింగ్ వ్యక్తిగత అనుభవంగా కాకుండా సామాజిక బాధ్యతగా గుర్తించాలన్నారు. మైనర్లు వాహనం నడిపినా, మద్య సేవించి వాహనం నడిపినా చట్టరీత్యా నేరమన్నారు.

గాండ్లపెంట/ఎన్పీకుంట: వాహనదారులు భద్రతా నియమాలు పాటిస్తూ వాహనాలు నడిపేతే ప్రమాదాలను నివారించవచ్చని కదిరి ఎంవీఐ డీఎస్ఎం వరప్రసాద్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా వాహన యజమానులు, డ్రైవర్లు, ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంవీఐ మాట్లాడుతూ.. ట్రాఫిక్ నియమాలు పాటించి ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలించరాదన్నారు. వాహన చోదకులు సీటు బెల్టు, హెల్మెంట్ తప్పక ధరించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రమణారెడ్డి, హెచ్‌సీ రామయ్య, కానిస్టేబుల్ భాస్కరరాజు పాల్గొన్నారు.

హామీ నెరవేర్చిన ఎమ్మెల్యే దుద్దుకుంట



బాసంవారిపల్లిలో బోరు వేయిస్తున్న దృశ్యం

నల్లమాడ: గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో గ్రామస్తులకు ఇచ్చిన హామీని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి నెరవేర్చారు. మండలంలోని బాసంవారిపల్లిలో ఇటీవల ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించిన విషయం తెలిసిందే. గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు బోరు వేయించాలని పలువురు గ్రామస్తులు ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి బాసంవారిపల్లికి బోరు మంజూరు చేశారు. శుక్రవారం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కుళ్లాయినాయక్, అంజినాయక్ పూజలు నిర్వహించి బోరు వేయించారు. నీరు సమృద్ధిగా రావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. జల జీవన్ మిషన్ కింద విద్యుత్ మోటారు, పైప్‌లైన్ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎన్‌హెచ్ బాషా, నాయకులు మాధవరెడ్డి, తిరుపాల్‌రెడ్డి, గోవిందరెడ్డి, షబ్బీర్, ప్రతాప్‌నాయక్ పాల్గొన్నారు.

సచివాలయాల కన్వీనర్ల నియామకం



మండల సచివాలయాల కన్వీనర్లుగా ఎంపికైన వైఎస్సార్‌సీపీ నాయకులు

తాడిమర్రి: ధర్మవరం నియోజకవర్గంలో ఆరుగురు వైఎస్సార్‌సీపీ మండల సచివాలయాల కన్వీనర్లను నియమించారు. శ్రీసత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తిలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు మాలగుండ్ల శంకరనారాయణ, జేసీఎస్ కో ఆర్డినేటర్ చల్లా మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం సమావేశం జరిగింది. ధర్మవరం పట్టణం సచివాలయాల కన్వీనర్‌గా చందమూరు నారాయణరెడ్డి, మోసపల్లి సాయికుమార్, ధర్మవరం రూరల్ పోతుకుంట శ్రీనివాసరెడ్డి, తాడిమర్రి మండల సచివాలయాల కన్వీనర్లుగా శివంపల్లి గ్రామానికి చెందిన అల్లే సాయినాథ్‌రెడ్డి, బత్తలపల్లి మండల సచివాలయాల కన్వీనర్‌గా ఎం.జయరామ్ రెడ్డి, ముదిగుబ్బ మండల సచివాలయాల కన్వీనర్‌గా విజయభాస్కర్‌ను ఎంపిక చేసినట్లు తెలిపారు.

విద్యతోనే ఉత్తమ భవిష్యత్తు



విద్యార్థికి షీల్డ్ అందజేస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

కొత్తచెరువు: బాల్య దశ నుంచే విద్యార్థులు విద్యలో రాణించినప్పుడే మంచి భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కేశాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గతేడాది 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు రామకృష్ణారెడ్డి మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ లక్ష్మీనరసింహారెడ్డి అధ్యక్షతన ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. మండల టాపర్‌గా నిలిచిన విద్యార్థికి రూ.10 వేల నగదు, షీల్డ్, ద్వితీయ స్థానంలో నిలిచిన మరో విద్యార్థికి రూ.5 వేల నగదు, షీల్డ్‌ను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నరేంద్ర రెడ్డి, ఇందిరమ్మ, హెచ్ఎం నారపరెడ్డి, తహసీల్దార్ రామాంజినేయులు రెడ్డి, మటన్ శంకర్, గోపాల్ రెడ్డి, కొండారెడ్డి, ఉపాధ్యాయుడు చెన్నకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కొత్తచెరువు: గర్భవతులు, బాలింతలు, చిన్నపిల్లలకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం సరఫరాలో గుత్తేదారులు అలసత్వం వహిస్తే చర్యలు ఉంటాయని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని మైలసముద్రం అంగన్‌వాడీ సెంటర్‌ను పరిశీలించారు. గత 20 రోజులుగా గుత్తేదారుడు బాలామృతం, చిక్కీలు సరఫరా చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిబద్ధతతో సెంటర్లకు అన్నీ అందిస్తుంటే ఏజెన్సీ వారు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. వెంటనే సీడీపీఓతో ఫోన్‌లో మాట్లాడారు. సెంటర్లలో 20 రోజులుగా పిల్లలకు పౌష్టికాహారం ఇవ్వకపోతే ఎలా అంటూ సూపర్‌వైజర్, సీడీపీఓలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటిని సరఫరా చేసే ఏజెన్సీపై వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు.

తాగునీటి కుళాయిల ఏర్పాటుకు భూమిపూజ

పుట్టపర్తి: మండలంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల పట్టాలిచ్చి, గృహాలు మంజూరు చేస్తున్నామని ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బుక్కపట్నం మండలం గోకివారిపల్లిలో జలజీవన్ మిషన్‌లో భాగంగా ఇంటింటికీ తాగునీటి కుళాయిలు ఏర్పాటుకు భూమి పూజ చేసి, పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే 3 వేలకు పైగా గృహాలు మంజూరు చేశామని తెలిపారు. గడిచిన మూడున్నర సంవత్సరాల్లో గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గోవిందరెడ్డి పాల్గొన్నారు.

'పుడా' అభివృద్ధికి సహకరించండి

పుట్టపర్తి అర్బన్: నియోజకవర్గంలోని ఆరు మండలాలకు విస్తరించిన పుట్టపర్తి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (పుడా) అభివృద్ధికి అందరూ సహకరించాలని పుడా వీసీ నరేష్‌కృష్ణ పేర్కొన్నారు. ఇంటి నిర్మాణాలకు సంబంధించి అపోహలు, సందేహాలను నివృత్తి చేసుకోవాలన్నారు. మూడు అంతస్తులు ,అంతకన్నా చిన్న ఇళ్లు నిర్మించుకోవడానికి పుడా అనుమతి అవసరం లేదన్నారు. పుట్టపర్తి రూరల్, కొత్తచెరువు, బుక్కపట్నం, నల్లమాడ, ఓడీచెరువు, అమడగూరు మండలాల్లో ఎక్కడైనా 3 అంతస్థుల కన్నా పెద్ద భవనాలు, ఏడున్నర సెంట్లు కన్నా పెద్ద స్థలంలో భవనాలు కట్టుకునేందుకు పుడా అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు.

మేలైన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

ఎన్పీకుంట: రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని ఏడీఏ సత్యనారాయణ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని ధనియానిచెరువు వద్ద రైతు వెంకటాద్రి పొలంలో వేరుశనగ పంటలో డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలిచ్చారు. నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకుని, వ్యవసాయ అధికారుల సహాయంతో విత్తన శుద్ధి చేసుకోవాలన్నారు. కలుపు మొక్కల నివారణకు ఎకరాకు ఒకటిన్నర లీటరు పెండిమిథిన్ మందు పిచికారీ చేసుకోవాలన్నారు. ఎకరాకు ఐదు పక్షి స్థావరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనంతరం జీవామృతం తయారీ విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో ఏఓ లోకేశ్వరరెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి శిరీష , ఎంపీటీసీ కొత్తరంగారెడ్డి, ఎఫ్ఈఎస్ సిబ్బంది, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ రాఘవయ్య పాల్గొన్నారు.

సజావుగా వాహనాల వేలం

ఓడీ చెరువు: అక్రమంగా మద్యం తరలిస్తూ పలు కేసుల్లో పట్టుబడ్డ ద్విచక్ర వాహనాలకు స్థానిక పోలీసుస్టేషన్‌లో శుక్రవారం వేలంపాట నిర్వహించారు. 12 ద్విచక్ర వాహనాలను వేలం వేయగా.. జీఎస్టీతో కలిపి ప్రభుత్వానికి రూ.3,33,144 ఆదాయం వచ్చినట్లు సెబ్ సీఐ జయనాథ్‌రెడ్డి, ఎస్ఐ గోపి తెలిపారు.

'మెరిట్ ప్రకారమే ఉద్యోగం వచ్చింది'

నల్లచెరువు: ప్రభుత్వ నిబంధనలు, మెరిట్ ప్రకారమే తనకు ఆశా కార్యకర్త పోస్టు వచ్చిందని మండల కేంద్రానికి చెందిన కవిత విలేకరులకు తెలిపారు. అయితే కొందరు దురుద్దేశంతో వైద్యాధికారులకు డబ్బులు ఇచ్చి పోస్టు తెప్పించుకున్నట్లు ఎల్లో మీడియాలో తప్పుడు కథనాలు రాశారని తెలిపింది. తాను ఎంఏ వరకు చదివానని, నల్లచెరువులో ఎల్లమ్మ గుడి సమీపం నివాసం ఉన్నానన్నారు. రేషన్‌కార్డు, కుటుంబ ఆధార్‌కార్డులు అన్నీ నల్లచెరువులోనే ఉన్నట్లు తెలిపారు. ఈ విషయంపై వైద్యాధికారి గనేనాయక్‌ను సంప్రదించగా.. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే కవితను ఆశా కార్యకర్త పోస్టుకు ఎంపిక చేశామన్నారు.

ద్విచక్ర వాహనం అపహరణ

నల్లచెరువు: స్థానిక ఓరువాయి రోడ్డులో నివాసముంటున్న పవన్ కుమార్‌కు చెందిన ద్విచక్ర వాహనం శుక్రవారం చోరీకి గురైంది. బాధితుడు తెలిపిన వివరాలు.. గురువారం రాత్రి ఇంటి బయట బైక్‌కు తాళం వేసి ఇంట్లో నిద్రపోయాడు. ఉదయం చూడగా బైక్ కనిపించలేదన్నాడు. ఈ విషయంపై ఎస్ఐ వరలక్ష్మిని సంప్రదించగా.. ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

బాట మారెమ్మకు పూజలు

కనగానపల్లి: మండల కేంద్రం సమీపంలో ప్రధాన రహదారి పక్కన వెలసిన బాట మారెమ్మ దేవతకు శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి, ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేశారు.

గృహ నిర్మాణ లబ్ధిదారులకు ఐకేపీ చేయూత

అమడగూరు: గృహ నిర్మాణ లబ్ధిదారులకు ఐకేపీ చేయూత అందిస్తోందని ఏపీఎం గోపాల్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక వీఓ కార్యాలయంలో మహిళా సంఘాల సభ్యురాళ్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఏపీఎం మాట్లాడుతూ.. మహిళా సంఘాల్లో ఉండి గృహాలు మంజూరైన వారందరికీ ఎస్‌హెచ్‌జీ కింద రూ.35 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇంటి పునాది పూర్తయిన తర్వాతనే డబ్బు ఖాతాలోకి జమ అవుతుందన్నారు. అనంతరం కంతుల వారీగా తక్కువ వడ్డీతో చెల్లించాల్సి ఉంటుందన్నారు. రుణాలను పొందిన వారు సక్రమంగా కంతులను చెల్లించడం ద్వారా వడ్డీ భారం పెరగకుండా ఉంటుందన్నారు.

రైతు వ్యతిరేక విధానాలపై 26న ట్రాక్టర్ ర్యాలీ

పుట్టపర్తి టౌన్: ప్రధాని మోదీ అనుసరిస్తున్న రైతాంగ విధానాలపై ఈనెల 26 సత్యసాయి జిల్లాలో ట్రాక్టర్లు, బైకు ర్యాలీలతో నిరసన చేపట్టనున్నట్లు ఏపీ రైతు సంఘం సమన్వయ కమిటీ నాయకులు తెలిపారు. శక్రవారం మున్సిపాలిటీలోలోని ప్రశాంతి గ్రామంలో పోస్టర్లు విడుదల చేశారు. జిల్లాలో మామిళ్ళకుంట క్రాస్ నుంచి గణేష్ కూడలి మీదుగా సత్యమ్మ గుడి వరకు ర్యాలీ నిర్వహిస్తామన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యవర్గ సభ్యులు జంగాలపల్లి పెద్దన్న, బడాసుబ్బిరెడ్డి, గిరీషం పాల్గొన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోండి

ధర్మవరం రూరల్: ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ మమతాదేవి కూలీలకు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని ఏలుకుంట్ల, నేలకోట గ్రామాల్లో ఉపాధి కూలీలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ప్రస్తుతం రైతుల పనులు పూర్తయ్యాయన్నారు. పనులు అడిగిన వారందరికీ పనులు కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీఓ అనిల్ కుమార్‌రెడ్డి, జేఈ నాగేంద్ర, పంచాయతీ కార్యదర్శులు చంద్రిక, విష్ణు పాల్గొన్నారు.

కోచింగ్ సెంటర్‌పై చర్యలు తీసుకోవాలి

కదిరి అర్బన్: పట్టణంలోని అనుమతిలేకుండా నిర్వహిస్తున్న కేఎల్ఎన్ కోచింగ్ సెంటర్‌పై చర్యలు తీసుకోవాలని రెవల్యూషనరీ విద్యార్థి సంఘం (ఆర్ఎస్‌యూ) నాయకులు శుక్రవారం ఆర్డీఓ రాఘవేంద్రకు వినతిపత్రం సమర్పించారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారనానరు. కార్యక్రమంలో చరణ్, విజయ్, ఖాదర్, బాషా, పునీత్ తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలకు భూమిపూజ

అమడగూరు: అమడగూరు సమీపంలో గతంలో ప్రభుత్వం ఉచితంగా ఇచ్చిన ఇళ్ల పట్టాల్లో ఇళ్ల నిర్మాణాలకు శుక్రవారం అధికారులతో కలసి వైఎస్సార్‌సీపీ నాయకులు భూమిపూ చేశారు. నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ప్రతి ఇంటికీ ప్రభుత్వం రూ.1.80 లక్షలు అందజేస్తుందన్నారు. కేవలం మూడు బిల్లులకే మొత్తం నిధులను జమ చేయనున్నట్లు పేర్కొన్నారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా ఇంత మొత్తాన్ని ఇంత తక్కువ విడతలకు చెల్లించలేదన్నారు. లబ్ధిదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నసీమా, హౌసింగ్ ఏఈ భానుప్రకాష్, పార్టీ కన్వీనర్ సూర్యనారాయణరెడ్డి, సర్పంచులు సురేంద్రరెడ్డి, షబ్బీర్, తదితరులు పాల్గొన్నారు.

కాటికోటేశ్వరుడి హుండీ కానుకల లెక్కింపు

తాడిమర్రి: మండలంలోని చిల్లవారిపల్లి కాటికోటేశ్వర స్వామి క్షేత్రంలో శుక్రవారం ఆలయ హుండీ కానుకలను లెక్కించారు. రూ.3,74,800 నగదు, ఒకటిన్నర తులం బంగారం, 10.85 తులాల వెండి ఆభరణాలు భక్తులు కానుకల రూపంలో సమర్పించినట్లు దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ గ్రామ కమిటీ చైర్మన్ నారాయణరెడి పాల్గొన్నారు.

విధులకు సక్రమంగా హాజరుకావాలి

బత్తలపల్లి: మండలంలోని 11 గ్రామ సచివాలయాల్లోని ఉద్యోగులు సక్రమంగా విధులకు హాజరు కావాలని ఎంపీపీ గుర్రం వనజ, ఎంపీడీఓ సాయిమనోహర్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని తంబాపురం సచివాలయ ఉద్యోగులతో సమావేశం ఏర్పాటు చేశారు. విధుల్లో భాగంగా బయటకు వెళ్లినప్పుడు మూమెంట్ రిజిస్టర్‌లో తప్పనిసరిగా రాయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచు జయచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాసరెడ్డి, నాయకులు రాంభూపాల్‌రెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

వేమన పద్యాలు యువతకు స్ఫూర్తి

పుట్టపర్తి: ప్రజాకవి యోగి వేమన పద్యాలు నేటి యువతకు స్ఫూర్తి అని బుక్కపట్నం సత్యసాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్ అన్నారు. ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ చంద్రశేఖర్, తెలుగు అధ్యాపకుడు ఆదినారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం యోగి వేమన జయంతి నిర్వహించారు. బ్రౌన్ ద్వారా వేమన పద్యాలు వెలుగులోకి వచ్చాయన్నారు. పద్యాలు సామాన్యులకు సైతం అర్థమయ్యేలా ఉన్నాయని పేర్కొన్నారు.

రామాపురంలో 'ఫ్యామిలీ ఫిజీషియన్' సేవలు

తాడిమర్రి: గ్రామీణ ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయమని వైద్యాధికారి మహేంద్రనాథ్ పేర్కొన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రామాపురంలో 104 సిబ్బందితో కలసి గ్రామస్తులకు వైద్య చికిత్సలు అందించారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులకు పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు.